క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. దూద్‌బౌలి విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. ఖాజీపురా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అఫ్జల్‌గంజ్‌లో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ పురానాపూల్ కేబుల్, పురానాపూల్ ఓవర్ హెడ్, గ్యాన్‌బాగ్ కాలనీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. జుమ్మేరాత్ బజార్, సేవాదళ్, జించిచౌరా, ముస్లిం జంగ్ పూల్, ఎంసీహెచ్ కాంప్లెక్స్ గోడేకి కబర్, పాన్ మండీ, గ్యాన్‌బాగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే 11 కేవీ కిషన్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఆసిఫ్‌నగర్, హుడా కాలనీ, జగదంబనగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గౌండ్ల మఠంలో మహా అన్నదానం



అన్నదానం చేస్తున్న నరేష్ గౌడ్, నవీన్‌కుమార్, నిర్మల నీలకంఠం గౌడ్

జియాగూడ: పురానాపూల్‌లోని సురాభాండేశ్వర గౌండ్ల మఠంలో మహా శివరాత్రి వేడుకలు జరిగాయి అర్ధరాత్రి అగ్నిగుండాలు, కల్యాణ మహోత్సవం, జాగరణ జరిగాయి. ఆదివారం ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ధర్మకర్తల పాలకమండలి అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్‌గౌడ్, ముఖ్య సలహాదారులు నిర్మల నీలకంఠం గౌడ్, ఉపాధ్యక్షులు యజ్ఞేశ్వర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, అశోక్‌కుమార్‌గౌడ్, వేణుకుమార్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు.

త్వరలో రోడ్డు పనులు ప్రారంభం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభమవుతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో మాట్లాడారు. సుమారు రూ.300 కోట్లతో ప్రస్తుతం కార్వాన్ నియోజకవర్గంలో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని, వీటిలో కొన్ని ప్రాంతాల్లో ఆ పనులు చివరి దశకు వచ్చాయన్నారు. రోడ్డు పనులు పూర్తికాగానే కొత్త సీసీ, వీడీసీసీ రోడ్లు వేయిస్తామని ఆయన పేర్కొన్నారు.

దేవర కరుణాకర్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోల్కొండ: గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ నిర్వహించిన సేవా కార్యక్రమాలను ముందుముందు కూడా కొనసాగిస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం దేవర కరుణాకర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనతో పాటు దేవర వంశీ తదితరులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గోల్కొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడి తండ్రి యమన్ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. అతని కుమారులు గుల్బాఖాన్, షాబాజ్ ఖాన్ వారి స్నేహితుడు షేక్ సజ్జాత్‌తో కలిసి బైక్‌పై వెళ్తున్నారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో టూంబ్స్ చౌరస్తా నుంచి టోలిచౌకి చౌరాస్తాకు వెళ్తున్నారు. అదే క్రమంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం వేగంగా గుల్బాఖాన్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదం వివరాలు తెలియగానే స్థానికులు యమన్ ఖాన్‌కు సమాచారం అందజేశారు. తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న ముగ్గురిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ షాబాజ్ ఖాన్ (23) నానల్‌నగర్‌లోని ఆలివ్ ఆస్పత్రిలో ఆదివారం తెల్లవారు జామున చికిత్సపొందుతూ మృతి చెందాడు. తీవ్రగాయాలతో షేక్ సజ్జన్ చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శివాజీ స్ఫూర్తి.. యువతకు దిక్సూచి



కేసరి హనుమాన్ స్వాగత వేదికపై అమర్‌సింగ్, మిత్రకృష్ణ తదితరులు

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఆదివారం అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శివాజీ చిత్రపటాలకు, విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేటి యువత ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు.
– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



శివాజీ జయంతి వేడుకల్లో రాష్ట్ర బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జ్ గోపాల్‌జీ



శివాజీ జయంతి వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు



జియాగూడ మహా శోభాయాత్రలో.. శంకర్, చంద్రకాంత్ తదితరులు



పూలమాలలు వేసిన శివయాదవ్, వెంకటేష్‌యాదవ్, జగదీష్‌యాదవ్



గన్‌ఫౌండ్రీలో .. నివాళులర్పిస్తున్న శ్రీధర్ తదితరులు



మొఘల్‌పురాలో..



అంబికానగర్‌లో.. సామ సుందర్‌రెడ్డి, సీఎం.ప్రవీణ్ రాజు



ఉప్పుగూడలో.. బీజేపీ నాయకుడు శ్రీనివాసారావు తదితరులు



గుడిమల్కాపూర్‌లో.. నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రంగారెడ్డి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ లైఫ్ టైం సభ్యులు

సుల్తాన్‌బజార్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా సొసైటీ ఎలక్షన్‌లో అవకతవకలు జరుగుతున్నాయని ఈ ఎన్నికలను రద్దు చేయాలని సొసైటీ లైఫ్ టైం సభ్యులు వెంకన్న బాబు, ఆంజనేయులు, రిషికేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు.. ఈనెల 23న జరిగే రంగారెడ్డి జిల్లా రెడ్ క్రాస్‌లో ఎన్నికల ప్రక్రియలు అవకతవకలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. ఎన్నికల లిస్టులో ప్రశ్నించే వారిని తొలగించి 1331 సభ్యులతో కూడిన లిస్టును సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్ జిల్లా కలెక్టర్‌కు అందజేశారన్నారు. దానిని పరిగణలోకి తీసుకొని ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారన్నారు. ఈనెల 11న ఎన్నికల అధికారి ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రతికా ప్రకటన విడుదల చేయడం జరిగిందన్నారు. 14న నామినేషన్, 15న స్క్రూటినీ, 16న విత్‌డ్రా, 23న ఎలక్షన్ ప్రకటన విడుదల చేశారని తెలిపారు. ఈ ప్రక్రియను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. 14న రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ ఎన్నికల అధికారికి 17013 పైచిలుకు సభ్యుల మరో లిస్టును సమర్పించామని, అందులో నుంచి నామినేషన్ దాఖలు చేసిన వారిని ఎన్నికల అధికారి వారి నామినేషన్‌ను తిరస్కరించారని తెలిపారు. ఈ విషయమై జిల్లా అధ్యక్షురాలుగా ఉన్న కలెక్టర్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న గవర్నర్‌కు వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు.

వ్యాస సంపుటి ఆవిష్కరణ



వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న రమణాచారి

నాంపల్లి: రిటైర్డ్ ఇంజినీరు రాధాకృష్ణ ఉప్పల రచించిన నాటి భారతమే నేటి భారతము(వ్యాస సంపుటి) గ్రంథావిష్కరణ ఆవిష్కరణ సభ ఆదివారం ఏసీగార్డ్స్‌లోని నఫీజ్ రెసిడెన్సీలో జరిగింది. జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుదిబండి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి హాజరై వ్యాస సంపుటిని ఆవిష్కరించి ప్రసంగించారు. బాషా ప్రవీణ డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ కృతిని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ కిరణం మాస పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, మన ఊరు–మనబడి సృష్టికర్త సుభాష్‌రెడ్డి, బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ కార్యదర్శి బండికల్లు శ్యామ్ ప్రసాద్, సాహితీ కౌముది వ్యవస్థాపక అధ్యక్షుడు వి.వి.సత్యప్రసాద్, స్థాపక కార్యదర్శి వెంకటదాసు పాల్గొన్నారు.

21న అవార్డుల ప్రదానం

అఫ్జల్‌గంజ్: అంతర్జాతీయ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాతృభాషా, విద్యారంగంలో సేవలు అందిస్తున్న పలువురు ప్రొఫెసర్లకు అవార్డులు అందజేస్తున్నట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొహమ్మద్ అక్తర్ అలీ తెలిపారు. ఆదివారం అఫ్జల్‌గంజ్‌లోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 21న ఓల్డ్ ఎమ్మెల్యే కాలనీలో నిర్వహించే కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ సంస్కృత భాషా విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ విద్యానంద్ ఆర్య, హిందీ విభాగం హెచ్‌ఓడీ మాయదేవి, ఉర్దూ విభాగం హెచ్‌ఓడీ అబ్దుల్ ముయిద్, సెయింట్ ఫ్రాన్సిస్ డిగ్రీ, పీజీ మహిళా కాలేజీ తెలుగు విభాగం హెచ్‌ఓడీ ఆత్మకూరి ప్రశాంత్‌లను భాషా ప్రావీణ్య శిరోమణి అవార్డు 2023తో సన్మానించనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: అభినయవాణి నృత్య నికేతన్, రింద శరణ్యాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించిన శ్రీకృష్ణ దేవరాయ ఆముక్త మాల్యద కూచిపూడి నృత్య రూపకం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రముఖ నృత్యగురువు బాలత్రిపుర సుందరి శిష్యబృంద చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి.



పరామర్శ



అబిడ్స్: అనారోగ్యానికి గురైన రహమత్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు మౌలాన ముఫ్తీ మహబూబ్ షరీఫ్ నిజామి ఆరోగ్యం కుదుట పడడంతో ఆయనను పరామర్శించిన అంతర్జాతీయ శాంతి రాయబారి డాక్టర్ మొహమ్మద్ ఐజాజ్ ఉజ్ జమాన్, సాలెబిన్ అబ్దుల్లా, అతీక్‌ఉర్ రహమాన్, డాక్టర్ జియా ఉల్లా షరీఫ్ తదితరులు

భక్తిశ్రద్ధలతో జాగరణ

అబిడ్స్: జాగరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో జాగరణ వేడుకలు నిర్వహించారు. జ్ఞాన్‌బాగ్ కాలనీ, దూల్‌పేట్ ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్, గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గోషామహల్‌లో..

గోషామహల్‌లోని పలు ప్రాంతాల్లో జాగరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాంబాగ్, బేగం బజార్, గోషామహల్ ప్రాంతాల్లో జరిగిన జాగరణ వేడుకల్లో రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్, ఆనంద్‌కుమార్‌గౌడ్, ఉద్యమ నేత ఆర్‌వీ.మహేందర్‌కుమార్, పప్పుమాత్రే, ప్రియాగుప్తా, శైలేష్ కురుమ పాల్గొని పూజలు చేశారు.

శంకర్‌జీ ఆలయంలో..

జియాగూడ: కాగజ్‌గూడ శంకర్‌జీ హనుమాన్‌జీ ఆలయంలో శ్రీ శివ జాగరణ మహోత్సవ వేడుకలు శ్రీ మహా శివరాత్రి జాగరణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. సేవా సమితి అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మోహన్‌గౌడ్, సలహాదారులు బానూరి నర్సిములుగుప్తా పర్యాటక అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాను, గ్రేటర్ టీఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు యాద శ్రీనివాస్ గుప్తాను ఘనంగా సన్మానించి సత్కరించారు.



ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను సన్మానించిన జాగరణ్ సేవా సమితి ప్రతినిధులు నరేష్‌గౌడ్, మోహన్‌గౌడ్



వేడుకలో ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్, ఆశీష్‌కుమార్‌యాదవ్



వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్‌వ్యాస్, ఆనంద్‌కుమార్‌గౌడ్

గ్రామాల చరిత్రను వెలికి తీయాలి



గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో ప్రతి గ్రామానికి ఒక చరిత్ర ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. ఆ చరిత్రను భావి తరాలకు అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందని అభిప్రాయపడ్డారు. ఆదివారం రవీంద్రభారతిలో రచయిత గుండెల రాజు రచించిన మహబూబాబాద్ జిల్లా జంగిలికొండ గ్రామ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాహిత్య అకాడమీ, ఉన్నత విద్యాశాఖల సంయుక్తంగా గ్రామాల చరిత్రను వెలికితీసేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర, ఓయూ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ పాల్గొన్నారు.



మక్కా మసీదు ముస్తాబు

చార్మినార్: రంజాన్ మాసానికి రెండు నెలల ముందుగా వచ్చే షబ్–ఏ–మేరాజ్ పర్వదినాన్ని పురస్కరించుకొని మక్కా మసీదును విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. శనివారం రాత్రంతా ముస్లిం ప్రజలు కళ్లు మిరమిట్లు గొలిపిన విద్యుత్ దీపకాంతుల నడుమ ఆధ్యాత్మిక జాగరణ చేశారు. అల్లాహ్ తరపు నుంచి నమాజ్ అవతరించిన సందర్భంగా నిర్వహించే ఈ పండుగ నేపథ్యంలో ఉలేమాలు నమాజ్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా రంజాన్ సన్నాహక ఏర్పాట్ల గురించి ముస్లిం మత పెద్దలు వివరించారు. షబ్–ఏ–మేరాజ్ నుంచే రంజాన్ మాసానికి సన్నద్ధమవ్వాలని ఇషా నమాజ్ అనంతరం మక్కా మసీదులో ఉలేమాలు ముస్లింలను కోరారు.

ఉత్సాహంగా కుస్తీ పోటీలు



మల్లయుద్ధానికి సై అంటున్న మల్లయోధులు

గోల్కొండ: ఛత్రపతి శివాజీ మహరాజ్ దేవర కరుణాకర్ మెమోరియల్ కుస్తీ పోటీలు జోరుగా సాగుతున్నాయి. మల్లయోధులు నువ్వా నేనా అన్నట్లుగా ఒకరిపై ఒకరు ఎత్తులు వేసుకుంటున్నారు. జూనియర్, సీనియర్, సబ్–జూనియర్ విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీలు గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెహిల్వాన్‌లు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

గోల్కొండ: నేటి యువత ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకుని హిందూ ధర్మ పరిరక్షణకు ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అమర్ సింగ్ ఆదివారం ఆయనను కలిశారు. ఆయన వెంట సునీల్‌యాదవ్, గోవర్ధన్, సచిన్ కామ్లేకర్, దినేష్ సింగ్ తదితరులున్నారు.



బండి సంజయ్‌ను కలిసిన అమర్ సింగ్ తదితరులు

బార్కాస్ ప్లాటినం కప్ విజేతగా ఎన్‌కేసీసీ జట్టు

చాంద్రాయణగుట్ట: బార్కాస్ ప్లాటినం కప్–2023 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. దక్కన్ డెమొక్రటిక్ క్లబ్ అధ్యక్షుడు హబీబ్ మోసిన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఎన్‌కేసీసీ జట్టు, యాఫై వారియర్స్‌పై 112 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.లక్ష నగదు, రన్నరఫ్ జట్టుకు రూ.50 వేల నగదు పురస్కారానికి హబీబ్ మోసిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట, బార్కాస్ డివిజన్ల కార్పొరేటర్లు అబ్దుల్ వాహబ్, షభానా హఫీజ్ పటేల్, స్థానిక క్రీడా ప్రేమికులు జమీల్ షర్ఫీ, అలీ బహెదిక్, అబ్దుల్లా బాజవన్, ఖాలేద్ రాషేది, హబీబ్ అబూద్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీతో విజయానందంలో ఎన్‌కేసీసీ జట్టు

రోగులు, రోగి సహాయకులకు నిత్యాన్నదానం



అన్నదానం చేస్తున్న రెడీ టూ సర్వ్ ప్రతినిధులు

నాంపల్లి: రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ద్వారా తలసీమియా, కేన్సర్, గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులను ఆదుకునేందుకు పదేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని రెడీ టు సర్వ్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ పెద్ది శంకర్‌గౌడ్ అన్నారు. రెడీ టు సర్వ్ ఫౌండేషన్ భారత గురూజీ ట్రస్టు సంయుక్త నిర్వహణలో ఆదివారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో రోగులకు, రోగి సహాయకులు అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న రోగులకు, వారి బంధువులకు నిత్యాన్నదానం చేయాలనే సంకల్పంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. డాక్టర్ కాచం సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నేత శరత్ చంద్ర, కో ఆర్డినేటర్ ప్రకాష్, ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ అగ్నిప్రమాదం

డబీర్‌పురా: డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ టెంట్ హౌజ్ సామగ్రి సప్లాయి దుకాణంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... డబీర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆజంపురా బ్రిడ్జి సమీపంలో అసద్ అలీ టెంట్ హౌజ్ సామగ్రి సప్లాయి దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం టెంట్ హౌజ్ దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి వివరాలు తెలియజేశారు. దీంతో రెండు అగ్నిమాపక కేంద్రాలకు చెందిన ఫైరింజన్లు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో దాదాపు రూ.3 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మంటలను అదుపులోకి తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది



పాతబస్తీలో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. చార్మినార్, మక్కా మసీదులతో పాటు సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్‌లతో పాటు నెహ్రూ జూలాజికల్ పార్కు పర్యాటకుల రద్దీతో కళకళలాడాయి. ఉదయం నుంచి సందర్శకులు ఎక్కువ సంఖ్యలో పాతబస్తీలోని పర్యాటక స్థలాలను సందర్శించారు. – చార్మినార్